మౌలిక వసతుల కల్పనకు కృషి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మేయర్

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 8, 26 డివిజన్లల్లో శుక్రవారం ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు పొద్దుటూరి శోభారాణి వెంకటేశ్‌గుప్తా, సీసా వెంకటేశ్‌గౌడ్, నేతలు పాన్నం తరుణ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు



బోడుప్పల్: మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ సలహాదారులు పీజీ సుదర్శన్ మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డిని శుక్రవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నేరాలు, దొంగతనాలు అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందుకు ఆయనను అభినందించారు. ఆయనను కలిసిన వారిలో సంఘం యాదగిరి, శ్రీనివాస్‌శర్మ ఉన్నారు.

గంగపుత్ర సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: బోడుప్పల్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర కేలండర్‌ను బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ కేలండర్‌లో పొందుపర్చిన సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కూర బాల రాజ్, ప్రధాన కార్యదర్శి బంగారి కుమార స్వామి, కోశాధికారి నాగుల లింగమూర్తి, ఉపాధ్యక్షులు జగన్నాథం, ప్రచార కార్యదర్శి రాజేశ్వర్, అశోక్, మనోహర్, రాజేందర్, యాదగిరి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కుషాయిగూడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పోలగొని శ్రవణ్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్సీకి వినతి



జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

కుషాయిగూడ: డివిజన్ అభివృద్ధి, సమస్యలపై మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ శుక్రవారం ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై ఆయనతో చర్చించినట్లు ప్రభుదాస్ తెలిపారు.

పద్మశాలి సేవా సంఘం కేలండర్ ఆవిష్కరణ



అల్వాల్: సమష్టిగా పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేద్దామని అల్వాల్–మచ్చ బొల్లారం పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బోగ బాలరాజు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను శుక్రవారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గోపి, ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డి.నర్సింగ్‌రావు, కోశాధికారి ఎస్.రాజు, బాలకిషన్, పాండురంగమ్, సుకన్య, జ్యోతి, విష్ణుమూర్తి, వై.శ్రీనివాస్, ఉప్పలయ్య, ప్రమోద్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛత.. జాడెక్కడ?

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అమలు తీరు ప్రశ్నార్థకంగా మారింది. స్వచ్ఛత కోసం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. అధికారులు సరిగ్గా స్పందించకపోవడం, కొరవడిన పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం లక్ష్యాన్ని దూరం చేస్తోంది. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఆరు డివిజన్లు ఉన్నాయి. ప్రతి డివిజన్‌లో చెత్త సేకరణకు ఆటోలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేందుకు మూడు రంగులతో కూడిన ప్లాస్టిక్ డబ్బాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కార్మికులు చెత్త సేకరిస్తుంటారు. ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా ఇప్పటికీ పలుచోట్ల బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారం కనిపిస్తోంది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నది అక్షర సత్యం. – మల్కాజిగిరి





- ఇంటింటికీ చెత్తసేకరణలో లోపాలు
- రోడ్లపైనే ఇష్టానుసారంగా చెత్త కుప్పలు
- అధికారుల ప్రయత్నాలు విఫలం
- కొరవడిన పర్యవేక్షణతో నెరవేరని లక్ష్యం
- అవినీతిమయంగా సంబంధిత విభాగం

గతంలో చెత్త సేకరణకు రిక్షాలు ఉండేవి. ఆ స్థానంలో స్వచ్ఛ ఆటోలు రావడంతో ఇంటింటికీ చెత్త సేకరించేందుకు కార్మికుడితో పాటు ఆటో డ్రైవర్ కూడా ఉంటాడు. ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు ఇంటికి వచ్చి చెత్త సేకరించాల్సి ఉంటుంది. వాస్తవ పరిస్థితుల్లో మాత్రం అది అమలు కావడం లేదు. వారిపై అజమాయిషీ అధికారులకు కాకుండా కాలనీ సంక్షేమ సంఘాలకు అప్పగించడంతో విఫలం అవుతున్నారు. ప్రతి ఇంటికి(అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్)కు రూ.100 ప్రతినెలా చెల్లించే విధంగా నిర్ణయించినప్పటికీ కొన్ని కాలనీల్లో ఆ మొత్తం



ఆర్‌కేనగర్ బ్రిడ్జి వద్ద అవగాహన కల్పిస్తూ వేసిన ముగ్గులు

ఎక్కువగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. చెత్త సేకరణకు వచ్చే కార్మికుడికి కాలనీలో ఉన్న ఇళ్ల సంఖ్య ఆధారంగా వారికి బాధ్యతలు అప్పగించారు. కార్మికుల వాదన మరోలా ఉంది. చెత్త సేకరణకు వెళ్తున్నా కొందరు దురుసుగా మాట్లాడటం, డబ్బుల కోసం రెండు మూడు పర్యాయాలు తిరిగినా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో అంతంత మాత్రమే..

బహిరంగ ప్రదేశాల్లో చెత్త సేకరణకు అధికారుల ప్రయత్నాలు విఫలమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బహిరంగ చెత్త వేసే ప్రాంతాలను తొలగించారు. ఆ ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేందుకు ప్రజలకు అవగాహన కోసం స్లోగన్స్‌తో ముగ్గులు వేస్తున్నారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని ఇటీవల సీసీ కెమెరాల నిఘాతో పాటు మైక్ ద్వారా హెచ్చరిస్తున్నా కొంత మంది ఇప్పటికీ అక్కడే చెత్త పడేస్తున్నారు.

నిరుపయోగంగా డస్ట్ బిన్స్

బహిరంగ ప్రదేశాల్లో, వ్యాపార సముదాయాల వద్ద, బస్టాప్‌ల వద్ద గతంలో తడి చెత్త(గ్రీన్ కలర్), పొడి చెత్త(బ్లూ కలర్) వేయడానికి రెండు డబ్బాలను ఏర్పాటు చేసేవారు. ఇటీవల వాటితో పాటు హానికరమైన వ్యర్థాలు పారేసేందుకు రెడ్ కలర్ డస్ట్ బిన్స్ ఏర్పాటు చేశారు. ఇవి మూణ్నాళ్ల ముచ్చటగా మారిపోయాయి. వాటిని ఉపయోగించకపోవడం, నాసిరకంగా ఉండటంతో నిరుపయోగంగా మారిపోయి లక్ష్యం నెరవేరడం లేదు. నిరుపయోగంగా మారిన డస్ట్‌బిన్స్‌ను ఉపయోగించడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

శానిటేషన్ విభాగం అస్తవ్యస్తం



శానిటేషన్ అమలు విధానంలో మార్పు రావాలి. ఇంటింటికీ చెత్త సేకరించే ఆటోలు, కార్మికులపై అధికారులు పట్టుకోల్పోయారు. మురికివాడల్లో ఇంటింటికీ చెత్త సేకరించినందుకు వసూలు చేసే రుసుం మాఫీ చేయాలి. శానిటేషన్‌లో అవినీతి పెరిగిపోయింది. సిబ్బంది పరంగా చూస్తే సంఖ్య చాలా తక్కువగా ఉంది. కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వలన వారికి కూడా నష్టం జరుగుతోంది. సిబ్బందికి అందజేయాల్సిన పనిముట్లు కూడా సరిగ్గా అందజేయడం లేదు.

– శ్రవణ్, మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్

ప్రజల్లో మార్పు రావాలి



స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజల్లో కూడా మార్పు రావాలి. ఇంటింటికీ చెత్త సేకరణలో కార్మికులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది పెంపు, కారుణ్య నియామకాలపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని సీసీ కెమెరాల నిఘాతో పాటు హెచ్చరిస్తున్నాం. గుర్తించిన వారికి జరిమానా విధిస్తున్నాం. ఎవరైనా డస్ట్‌బిన్స్ తొలగిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మంజుల, ఏఎంహెచ్‌ఓ

చిలుకానగర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పలుచోట్ల సీసీ రోడ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బీరప్పగడ్డ ప్రాంతంలో వరద నీటి డ్రైన్‌కు, అజమత్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం, ఇందిరానగర్‌లో బోర్ వేయడానికి తదితర పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా వినతి పత్రంలో కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌ను మద్యం సరఫరా చేసే ప్రైవేట్ ఈవెంట్ కార్యక్రమాలకు అద్దెకు ఇవ్వొద్దని కోరినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని భూదేవినగర్‌లో జరుగుతున్న కల్వర్టు పనులను శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితఅనిల్‌కిషోర్‌గౌడ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. తద్వారా ప్రజాధనం వృథా కాకుండా నిర్మాణాలు చాలాకాలం నిలుస్తాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈవెంట్ నిర్వాహకులకు భారీ జరిమానా

ఉప్పల్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా గతనెల 31న ఉప్పల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈవెంట్ నిర్వాహకులకు జీహెచ్‌ఎంసీ భారీ జరిమానా విధించింది. ఈవెంట్ పేరిట గ్రౌండ్‌ను కంపు కంపు చేసినట్లు అధికారులు గుర్తించారు. స్థానికులకు ఇబ్బంది కలిగించే విధంగా ఈవెంట్ నిర్వహించినందుకు ప్రధాన నిర్వాహకుడు శివశంకర్‌రెడ్డికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు తెలిపారు.

నివాళి



ఈసీఐఎల్ చౌరస్తాలో పూలే చిత్రపటానికి నివాళ్లు అర్పించిన ధర్మేంద్ర, సత్యప్రసాద్

కుషాయిగూడ: మహిళల చదువు వారి అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటం చేసిన ధీర వనిత సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈసీఐఎల్ చౌరస్తాలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, మధురిమ, కీర్తన్, రవళి, సరిత, దీప్తి, రమ్య, శృతి, సునయన తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



అల్వాల్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఇరుకుల రామకృష్ణగుప్తాను వైఎస్సార్ సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, వైశ్య సంఘం నేత తడక జగదీశ్వర్‌గుప్తా శుక్రవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



అల్వాల్: నూతన సంవత్సరం సందర్భంగా నేరేడ్‌మెట్ డివిజన్ వాయుపురి కాలనీ అధ్యక్ష కార్యదర్శులు టీజే.రెడ్డి, శ్రీనివాస్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చెన్నారెడ్డి, యాది, మధు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ నోమా మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సూర్యనగర్ ఫీడర పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శక్తి సాయినగర్, సూర్యనగర్, ఉదయ్‌నగర్, మల్లికార్జున్‌నగర్, గుల్మోర్‌గార్డెన్, ఛాండీయానగర్, గోకుల్‌నగర్, బ్యాంక్ కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. విద్యుత్ అంతరాయనికి ప్రజలు సహకరించాలని కోరారు.

మేడిపల్లి: 11కేవీ వెంకట సాయినగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమత్తుల కారణంగా 33/11 చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శివగణేష్ నగర్, ఎంఎల్‌ఆర్ కాలనీ, అక్షయ నగర్, దత్తాత్రేయ నగర్, సీపీఆర్‌ఐ కాలనీ, ఫ్రీవిలేజ్, వెంకట సాయి నగర్, కృష్ణనగర్, సాయి రెసిడెన్సీ, నందిని నగర్‌లలో కరెంటు నిలిపి వేస్తామని విద్యుత్ అధికారి తెలిపారు.

ముమ్మరంగా ఇరుముళ్ల కార్యక్రమం



మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ ఆలయం నుంచి శుక్రవారం పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు ఇరుముళ్లు కట్టుకొని శబరి యాత్రకు బయలుదేరారు. రాముగురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముళ్ల ప్రక్రియ శాస్త్రోక్తంగా జరిగింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, మండల రాధాకృష్ణ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 18వ పడి రవి గురుస్వామి, కుమార స్వామి, రాజ్‌కుమార్, సుబ్బారావు, నాగరాజు, మనోజ్, ముచేంద్ర యాదవ్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట



మేడిపల్లి: కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు పార్టీ సీనియర్ నాయకులు పీర్జాదిగూడ మున్సిపల్ 2వ డివిజన్ కార్పొరేటర్ సుభాష్ నాయక్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన చెప్పారు.

రెండిళ్లలో చోరీ

మేడిపల్లి: తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాచవాని సింగారం క్రాంతి దీప కాలనీలో నివాసం ఉండే యుగేందర్ ప్రైవేటు ఉద్యోగి. మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. తిరిగి బుధవారం రాత్రి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో 5 తులాల బంగారు నగలు, 40 తులాల వెండి వస్తువులు, రూ.50 వేలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేకాలనీలో నివాసం ఉంటున్న మధు క్రిస్మస్‌కు ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి 20 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో బాధితులు మేడిపల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి గురైన డీసీఎం లభ్యం

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలో గురువారం అపహరణకు గురైనా డీసీఎం లభ్యమయింది. డీసీఎం దొంగతనం చేసిన నిందితుడిని శుక్రవారం నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వికాగ్ ఎకో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని గగన్‌పహాడ్ నుంచి చర్లపల్లికి మారుస్తున్న క్రమంలో మూడు డీసీఎంలలో కంపెనీకి చెందిన మెటీరియల్‌ను తరలిస్తున్నారు. ఈ క్రమంలో నాచారం పారిశ్రామికవాడలోని రోడ్ నంబర్–7లో డీసీఎంను రాత్రి పార్క్ చేశారు. ఉదయం డీసీఎం కనిపించకపోవడంతో కంపెనీ ఆపరేషన్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఎస్.వెంకటయ్య సీసీ పుటేజీలను పరిశీలించారు. నాచారం అంబేడ్కర్ నగర్‌కు చెందిన షేక్ నిరంజన్(37)ను నల్గొండ జిల్లా పెద్దవూర వద్ద అరెస్టు చేశారు. డీసీఎంతో పాటు 46 లక్షల విలువ చేసే మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నాచారం పోలీసులను మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి అభినందించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను శుక్రవారం ఉప్పల్/మల్కాజిగిరి జోన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



గౌతంనగర్ చౌరస్తాలో..



గౌతంనగర్‌లో నివాళులర్పిస్తున్న బీసీల ఐక్య వేదిక సభ్యులు



నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తూ..



కాప్రా గాంధీనగర్‌లో



ఏఎస్‌రావునగర్‌లో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో..

పాతకక్షలతో వ్యక్తి దారుణ హత్య

ఉప్పల్: పాతకక్షలతో ఓ వ్యక్తిని కత్తులతో పొడిచి బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అంబర్‌పేట బాపూనగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ నబీ(30) రామంతాపూర్ కేసీఆర్‌నగర్ ప్రాంతంలోని టెంట్‌హౌజ్‌లో పనిచేస్తాడు. గతంలో అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో నబీ జైలుకు వెళ్లి ఈమధ్య కాలంలో వచ్చాడు. బాధితులు కొన్ని రోజులుగా నబీ కదలికలను గమనిస్తూనే ఉన్నారు. రామంతాపూర్ బాలకృష్ణానగర్ మూసీ ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం కత్తులతో దాడి చేశారు. కింద పడగానే బండ రాయితో మోది దారుణంగా హత్య చేసి పారిపోయారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దీప్తి ఆత్మహత్య కేసులో ఇద్దరికి రిమాండ్

మల్లాపూర్: నాచారం సరస్వతి నగర్‌కు చెందిన ఐఐసీటీ పీహెచ్‌డీ విద్యార్థి పులివర్తి దీప్తి ఆత్మహత్య ఘటనలో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను శుక్రవారం నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ వివరాల ప్రకారం.. దీప్తి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు జాబ్ విషయంలో డబ్బుల కోసం దీప్తిని వేధించిన కానిస్టేబుల్ అనిల్(35) బావమరిది సైదులు(40) వేధించారని తల్లి ఫిర్యాదు మేరకు పరారీలో ఉన్న కానిస్టేబుల్ అనిల్, బావమరిది సైదులను శుక్రవారం నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో గతనెల 27న ముగురిని రిమాండ్ తరలించిన విషయం తెలిసిందే.